# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. భారత్ దౌత్య పరమైన చర్చలకు ప్రాధాన్యత ఇస్తుందని రైసినా డైలాగ్ సమావేశంలో పేర్కొన్న విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్
2. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలనే లక్ష్యంలో జల జీవన్ మిషన్ పనులు చేపడుతున్నామని పేర్కొన్న ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్
3. ప్రపంచ స్థాయి వినోద సౌకర్యాలు, థీమ్ పార్కుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపిన పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
4. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు లబ్ధిదారులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్న అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీ నారాయణ

==========================

భారత్ దౌత్య పరమైన చర్చలకు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ పేర్కొన్నారు. ఢిల్లీలో జరుగుతున్న రైసినా డైలాగ్ 2026 రెండవ రోజు సమావేశంలో మంత్రి ఈ రోజు పాల్గొని ప్రసంగించారు. జాతీయ ప్రయోజనాల ఆధారంగా భారత్ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. రు. గ్లోబల్ సౌత్ కు స్థిరమైన సముద్ర అభివృద్ధి అవసరమని , ఇండో-పసిఫిక్ ప్రాంతంలో యధాతథ స్థితిని మార్చడానికి జరిగే ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తుందని చెప్పారు.బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా కూటమి – బ్రిక్స్ అధ్యక్ష పదవిని భారత్ చేపట్టినప్పుడు స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, స్థిరత్వం అనే నాలుగు ప్రధాన అంశాలపైదృష్టి సారిస్తుందని తెలిపారు.

--------------------------

రాష్ట్ర శాసన సభ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. సభ ప్రారంభం కాగానే శాసనసభాపతి సిహెచ్ .అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.. శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లుపై శాసనసభలో చర్చ అనంతరం ఆ బిల్లుకు శాసన సభ ఆమోదం తెలిపింది. ప్రశ్నోత్తరాలలో భాగంగా రాష్ట్రంలో ఆహార కల్తీ నివారణ చర్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నకు వైద్య, ఆరోగ్య మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ సమాధానం ఇచ్చారు. ఆహార కల్తీ నియంత్రణ కోసం చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. 2023 నుంచి 2026 వరకూ 16వేల700 ఆహార నమూనాలు పరిశీలించామని వాటిలో 14వందల నమూనాల్లో కల్తీ జరిగినట్లు తేలిందన్నారు.సింథటిక్ రంగులు ఆహారాన్ని కల్తీ చేయటంతో పాటు

ప్రజలకు అనారోగ్యాన్ని కలిగిస్తున్నాయని చెప్పుకొచ్చారు. వీటిపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆహార కల్తీ నిర్ధారించే ప్రయోగశాలను పెంచుతామని అన్నారు

---------------------------

రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలనే లక్ష్యంలో జల జీవన్ మిషన్ పనులు చేపడుతున్నామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. శాసనసభలో ద్రవ్యవినిమయ బిల్లుపై జరిగిన చర్చలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తాగునీరు అందించేందుకు చేపట్టిన ప్రాజెక్టులను వేసవిలో పూర్తిచేసి ప్రజలకు నీరు అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా నీటి కొరత ఉన్న గ్రామాలలో గుర్తించామని వాటికి నీరందించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 31సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ప్రపంచ స్థాయి వినోద సౌకర్యాలు, థీమ్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో డిస్నీ వరల్డ్ తరహా ప్రాజెక్టును ఏర్పాటు చేసే ప్రతిపాదనపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి శాసనసభలో సమాధానమిచ్చారు. డిస్నీ వరల్డ్ లేదా యూనివర్సల్ స్టూడియోస్ వంటి ప్రాజెక్టులకు భారీ పెట్టుబడి అవసరమవుతుందని పేర్కొన్నారు. ఇటువంటి ప్రాజెక్టులను ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్ సంస్థలే నిర్వహిస్తాయని, ప్రభుత్వం కేవలం భూమి కేటాయింపు, అనుమతులు, రాయితీలు మాత్రమే కల్పిస్తుందని వివరించారు. ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఆంధ్రప్రదేశ్ పర్యాటక విధానం' ద్వారా రాయితీలు కల్పిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

రాజధాని అమరావతిలో ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నామని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో మంత్రులు సవిత, సంధ్యారాణి నిన్న సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమరావతిలోని పేరేడ్స్ మైదానంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారని చెప్పారు. మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా 36 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు వెల్లడించారు. అలాగే స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాల చెక్కులు పంపిణీ చేయడంతో పాటు మహిళా లబ్ధిదారులకు వాహనాలను అందజేయనున్నట్లు తెలిపారు.

---------------------------

దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చేందుకు కేంద్ర బడ్జెట్ ఉపయోగపడుతుందని రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ చెప్పారు. విజయవాడలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ, దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ రూపొందిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి, పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిధులు ఇస్తోందని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారులు, పోర్టులు, విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం

ప్రాధాన్యతనిస్తోందని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ తెలిపారు.

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీ నారాయణ అధికారులకు సూచించారు. అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మతో కలిసి ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబికా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లా మరింత ప్రగతి సాధించేలా వివిధ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సకాలంలో ప్రయోజనాలు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలును నిర్ణీత గడువులోపు అమలు చేయాలని తెలిపారు.

---------------------------

తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ రేపు పాల్గొంటారని విశ్వవిద్యాలయం ఉపకులపతి వి.ఉమ తెలిపారు. తిరుపతిలో ఆమె ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా కులపతి హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారని తెలిపారు. వివిధ కోర్సుల్లో డిగ్రీలు పూర్తి చేసిన 1600 విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తామని ఆమె తెలియజేస్తూ,

వాయిస్ 33సెకన్లు

---------------------------

విజయవాడలోని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మహా కుంభాభిషేకం మహోత్సవాలు ఈ రోజు నుంచి ప్రారంభమయ్యాయని ఆలయ అర్చకులు మారుతి యజ్ఞ శర్మ తెలిపారు. ఇందులో భాగంగా ఈ రోజు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయని చెప్పారు. 12 ఏళ్లకు ఒకసారి జరిగే మహా కుంభాభిషేకం ఇంద్రకీలాద్రిపై ఈ రోజు నుంచి ఈ నెల 8 వ తేదీ వరకూ మూడు రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ మాట్లాడుతూ.. మహాకుంభాభిషేకం సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

---------------------------

మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతూ సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 08న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో మహిళా అధికారులు, సిబ్బందికి నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ఈ రోజు ప్రారంభించారు.

======================